# జర్నలిస్ట్‌లు సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు తరలిరావాలి

## టి యు డబ్ల్యూ జె ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాస్ రావు



సూర్యా పేట: అక్టోబర్ 1(వాయిస్ టుడే ప్రతినిధి): దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ జే యు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం చేపట్టే ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హాజరై జయప్రదం చేయాలని టియు డబ్ల్యూ జె, ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం టి యు డబ్ల్యూ జె ఐజెయు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై గాంధీ జయంతి సందర్భంగా ఎంజి రోడ్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన అనంతరం కొత్త బస్టాండ్ వద్ద వద్ద ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తదుపరి సూర్యాపేట జిల్లా కలెక్టర్కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా ఉంటూ, అక్షరమే ఆయుధంగా జీవనాన్ని కొనసాగిస్తున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వహిస్తున్నాయని ఆరోపించారు. వృత్తిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, బస్సు పాస్ లో రాయితీలో కూడా కూడా వన్ బై థర్డ్ కాకుండా 50% బస్సు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్ వ్యవస్థగా పరిగణించే జర్నలిజం రంగానికి రక్షణ లేకుండా పోయిందని, జర్నలిస్టుల హక్కుల రక్షణకై జర్నలిస్టులపై దాడులు నియంత్రించే విధంగా ప్రత్యేక చట్టం తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ యూనియన్ పర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్,(టి యు డబ్ల్యూ జే ఐజెయు ) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బంటు కృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి బత్తుల మల్లికార్జున్, సీనియర్ జర్నలిస్ట్ లు సుంకర బోయిన వెంకటయ్య, కందుకూరి యాదగిరి,9లైజ షేక్ జహీర్, శిగ సురేష్, ఏబీఎన్ మల్లేష్, షేక్ రషీద్, గుడిపూడి రామకృష్ణ, కందుల నాగరాజు, ఉయ్యాల నరసయ్య, మాదగోని వేణు, పల్లె మణి బాబు, బిగ్ టీవీ రామకృష్ణ, కొండ్లె కృష్ణయ్య, తండు వెంకన్న, ఏబీఎన్ మల్లేష్, మహా న్యూస్ సురేందర్, దుర్గం బాలు, యో యో టివి శంకర్, వల్దాస్ శంకర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## అహింసా మూర్తి... అడుగుజాడలు..!!

యుగ పురుషుని చైతన్య శంఖారావం
శతాబ్దాల బానిసత్వపు చీకటి కోణాల్లో
దిక్కుతోచక అలమటించిన భారతావనికి,
సత్య శోధనతో మార్గం చూపిన
అపూర్వ సూర్యోదయం... మన గాంధీయం !
ఫిరంగుల మోతల్లేవు, కత్తుల దూకుడు లేదు
రక్తపాతపు రణరంగాల అరుపులు లేవు,
ధరించిన మోరట ఖద్దరు వస్త్రమే... ఒక సైన్యమై,
చేతబట్టిన ముసలి చేతికర్రే... ఒక బ్రహ్మాస్త్రమై,
సామ్రాజ్యవాదపు పునాదులను కదిలించిన
అహింసా సమరయోధుడు మన బాపూజీ!
చరఖా చక్రపు తిరుగుడులో...
స్వదేశీ ఆత్మగౌరవాన్ని వడికిన శ్రామికుడు!
ఉప్పు సత్యాగ్రహపు నడకలో...
జాతి బేధాలను తుడిచేసిన సమతావాది!
హరిజన సేవా దీక్షలో...
మానవత్వపు పరమార్థాన్ని చాటిన సంస్కర్త!
అక్టోబర్ రెండున విగ్రహాలకు పూలదండలు వేసి
ఆ మరుసటి రోజే ఆశయాలను విస్మరిస్తే
అది గాంధీ జయంతి ఎలా అవుతుంది?
ఆయనను కేవలం చరిత్ర పుటలకే పరిమితం చేస్తే
దేశానికి ముక్తి ఎలా దొరుకుతుంది?
స్వచ్ఛత లేని సమాజంలో స్వరాజ్యమెక్కడిది?
హింసతో నిండిన హృదయాల్లో శాంతి ఎక్కడిది?
అవినీతి రొంపిలో తలమునకలవుతూ...
ఆయన కన్న కలల భారతాన్ని ఎలా సాధిస్తాం?
లెగండి! చైతన్య శంఖాన్ని పూరించండి!
మహాత్ముని అడుగుజాడల్లో పునరంకితం అవ్వండి!
సత్యమే మీ వాక్కుగా, అహింసయే మీ మార్గంగా,
కులమతాల గోడలను కూల్చే సమానత్వమే మీ శ్వాసగా,
నవభారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించండి!
బాపూజీ చూపిన శాంతి మార్గంలో పయనిద్దాం,
ప్రపంచ దేశాల ముంగిట...
భారత కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగుర వేద్దాం!

(నేడు జయంతి సందర్భంగా
ఆ మహాత్మునికి అక్షర నీరాజనం!)



(గిరి ప్రసాద్ సోముల..జర్నలిస్ట్ )

## విద్యుత్ రంగంపై తప్పుడు ప్రచారం: మంత్రి పొంగులేటి



ఏదులాపురం: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు ఆ రంగంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్న తమ ప్రభుత్వంపై భారాస తప్పుడు ప్రచారానికి పాల్పడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలోని తరుణీ హట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు డివిజన్ ఈఆర్ఓ కార్యాలయాన్ని కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేస్తే తమ ప్రభుత్వం అధికారం చేపట్టాక పనులు పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో సబ్‌స్టేషన్ల నిర్మాణం, హైటెన్షన్ వైర్ల మార్పిడి, తదితర పనులకు ఇప్పటివరకు రూ.205 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తికాగా మిగిలినవి పూర్తి చేయనున్నట్లు వివరించారు. విద్యుత్తు శాఖ డైరెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్ఈ శ్రీనివాసాచారి, ర.భ. శాఖ ఎస్ఈ యుగంధర్‌రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, పాల్గొన్నారు.

## క్రికెట్ బ్యాట్‌తో బాది.. హతమార్చి



హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి దారుణ హత్య కలకలం రేపింది. ఆర్థిక వ్యవహారాల్లో విభేదాలతో దుండగులు క్రికెట్ బ్యాట్‌తో తలపైకొట్టి దారుణంగా హతమార్చారు. మేనల్లుడు, మరో వ్యక్తి ఈ హత్యకు ప్రధాన సూత్రధారులని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కంపాటి వెంకన్న(40) నిజాం కళాశాలలో పీజీ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీలో చేరి మధ్యలో ఆపేశాడు. అతనికి ఇద్దరు పిల్లలున్నారు. పదేళ్ల క్రితం భార్యతో విడిపోయాడు. ప్రస్తుతం కోకాపేటలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. వెంకన్న కొన్నేళ్లుగా వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. వాహనాలను తనఖా పెట్టుకుని రుణాలు ఇస్తుంటాడు. మేనల్లుడికి, మరికొందరికి తనఖా రుణాలు ఇప్పించాడు. తిరిగి ఇవ్వకపోవడంతో మేనల్లుడిని ప్రశ్నించడంతో గొడవలు జరిగాయి. ఇటీవల మరో వ్యక్తి కారును తనఖా పెట్టుకున్నాడు. దీన్ని మేనల్లుడు తీసుకెళ్లిన క్రమంలో రోడ్డు ప్రమాదం జరగడంతో వెంకన్న దూషించాడు. కక్ష పెంచుకున్న మేనల్లుడు.. తన మామను హతమార్చాలని పథకం వేశాడు. బుధవారం సాయంత్రం వెంకన్నకు కాల్ చేసి తీసుకున్న డబ్బు తిరిగిస్తానని కోకాపేటకు రావాలని సూచించాడు. అక్కడికి వెళ్లగా..కాళ్లు, చేతులు కట్టేసి.. క్రికెట్ బ్యాట్‌తో కొట్టారు. దెబ్బలు తాళలేక వెంకన్న మరణించాడు. నిందితులు కారులో మృతదేహాన్ని వదిలేసి వెళ్లిపోయారు.

స్థానికుల సమాచారంతో..కోకాపేటలో గురువారం ఉదయం మృతదేహాన్ని చూసిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్సింగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని.. వెంకన్న చెల్లెళ్లు ఇద్దరికీ కాల్ చేశారు. ఓ సోదరి వెంటనే ఘటనాస్థలికి రాగా మరొకరు రాలేదు. తన కుమారుడు రాత్రి సోదరునితోనే ఉన్నాడని, అతడు ఏదైనా చేసి ఉండొచ్చనే అనుమానంతో ఆమె రాలేదు. అనుమానం వచ్చిన పోలీసులు ఆమె కుమారుడితో ఫోన్‌లో మాట్లాడారు. రాత్రి ఎక్కడున్నావని ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలిచ్చాడు. ఠాణాకు రమ్మని పిలిస్తే ఆలస్యం చేశాడు. పోలీసులు వెంటనే లొకేషన్ ఆధారంగా నివాసానికి వెళ్లగా పరారయ్యాడు. ప్రత్యేక బృందాలతో నిందితుడిని, మరొకర్ని అదుపులోకి తీసుకున్నారు.

## ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి



ఖమ్మం: ఖమ్మం నగరంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్, వెరిఫికేషన్ ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య.. ఏఈఆర్‌వోలు, సూపర్వైజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఏఈఆర్‌వోల వారీగా సమీక్షించారు. మొత్తం 75 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 25 శాతం ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. మిగిలిన 25 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియను అక్టోబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు.

ఏఆర్‌వోల వారీగా పనుల పురోగతిని పరిశీలిస్తూ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. బీఎల్‌వోలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టేలా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని చెప్పారు. నోటీసులు, వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇంటి వద్ద సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేని సందర్భంలో, నిబంధనల మేరకు వారికి వాట్సాప్ ద్వారా సంబంధిత ఫారాలను పంపించేలా బీఎల్‌వోలను గైడ్ చేయాలని ఆదేశించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారి దరఖాస్తులతో పాటు, ఓటర్ల వివరాల్లో సవరణలు, తొలగింపులు, ఇతర మార్పులకు సంబంధించిన పెండింగ్ ఫారాలను కూడా పరిశీలించి, నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ మొదటి వారంలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా ఏఆర్‌వోలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.



## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ చైర్మన్ కొమ్ము నరసింహారావుకు ఘన సన్మానం

ముదిగొండ మండలం అక్టోబర్ 1 వాయిస్ టుడే : ముదిగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొమ్ము నరసింహారావును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చి రామయ్య స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కొమ్ము నరసింహారావు నియామకానికి సహకరించి ఆమోదం తెలిపిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జి మల్లెల అజయ్, ×చీఖజ అధ్యక్షులు ఉసికల రమేష్, రాఘవాపురం గ్రామ శాఖ అధ్యక్షులు వీర్ల సుధాకర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు నాయిని సునీత వెంకటేశ్వర్లు, ముదిగొండ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఇరుకు కొరివి, నాయకులు మల్లెల ఉపేందర్ రావు, బూరుగు శ్రీను, బలంతు వెంకట్, అంతోటి నాగరాజు, వేల్పుల హరికృష్ణ, కందుల పుల్లయ్య, రాఘవ, ముదిగొండ సోషల్ మీడియా కన్వీనర్ మాణిక్యం అఖిల్ దాస్ పాల్గొన్నారు.



## డ్రైనేజీ ఏర్పాట్లపై మున్సిపల్ చైర్మన్ పరిశీలన

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని ప్రజలకు డ్రైనేజీ సౌకర్యం మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలోని 10,8 వార్డుల్లో మురికి కాలువ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని, అంతర్గత విద్యుత్ పోల్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిశీలించి, డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన స్థలం, నీటి ప్రవాహ మార్గం, స్థానిక పరిస్థితులపై సిబ్బందితో చర్చించారు. వర్షాకాలంలో మురుగు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపేలా డ్రైనేజీ పనులు చేపట్టాలని సూచించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్న చైర్మన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ మనోహర్,కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, రాకేష్ నాయక్,మచ్చ గంగ లక్ష్మి, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, ఎలిగేటి అనిల్, మచ్చ శేఖర్,బత్తిని నాగరాజు, మున్సిపల్ సిబ్బంది ఫయాజ్ ,వినయ్, విద్యుత్తు సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## జాతీయ లేజర్ రన్ పోటీలకు ఏకత్వా క్రీడాకారులు ఎంపిక

కృష్ణా/ఎన్టీఆర్ జిల్లా(వాయిస్ టుడే) : వీరులపాడు మండలంలోని పొన్నవరం గ్రామంలో గల ఏకత్వా అంతర్జాతీయ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు (అండర్ 09 ) విభాగంలో గోగులమూడి లియోన్ సాహస్ విజయ్, నియా విజయ్, నక్కా జాన్ హైడ్, ఈదా నయన్ రెడ్డి, గొట్టిపాటి శ్రీక్షిత, (అండర్ 11) విభాగంలో మల్లెల పవన్ తేజ, (అండర్ 15 ) విభాగంలో శేషం రేచల్ ప్రియా జాతీయ లేజర్ రన్ పోటీలకు ఎంపిక అయినట్లు కృష్ణా జిల్లా మోడరన్ పెంటాతలన్ సంఘం కార్యదర్శి కోటా కృష్ణ మోహన్ తెలిపారు. వీరికి గురువారం ఏకత్వ పాఠశాల ఆవరణలో పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం కాలక్షేపం కోసం మాత్రమే కాదని అవి ఉజ్వల భవిష్యత్తుకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని అన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం కాబట్టి ప్రతి ఒక్కరూ రోజూ ఏదో ఒక ఆటను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు కృష్ణా మోహన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని అల్లూరి సీతగారామరాజు క్రీడా మైదానంలో జులై 10 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ జాతీయ మోడరన్ పెంటాతలన్ లో భాగం అయిన లేజర్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ జాతీయ పోటీలు మహారాష్ట్ర లోని నాశిక్ లో అక్టోబర్ 4వ తేదీ నుండి 6వ జరుగుతాయని అన్నారు.

## జాతీయ వేదికపై సై అంటున్న చిన్న అవుటపల్లి పుత్రులు

కృష్ణా/ఎన్టీఆర్ జిల్లా(వాయిస్ టుడే): గన్నవరం మండలం, చిన్న అవుటపల్లి గ్రామ ముద్దుబిడ్డలు గోగులమూడి లియోన నియా నాసిక్, మహారాష్ట్రలో జరగనున్న జాతీయ మోడరన్ పెంటాథ్లాన్ ఛాంపియన్‌షిప్‌కుఎంపికై గ్రామానికి అరుదైన గౌరవాన్ని తెచ్చారని జిల్లా మోడరన్ పెంటాతలన్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణా మోహన్ తెలిపారు. చిన్న గ్రామం నుండి జాతీయ స్థాయికి ఎదగడం అంటే మామూలు విషయం కాదని వారి కృషి, పట్టుదల చిన్న అవుటపల్లి యువతకు స్ఫూర్తిదాయకమని లియోన్, నియాలకు గ్రామం తరపున పెద్దలు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ జాతీయ పతకంతో తిరిగి రావాలని మనసారా కోరుకుంటున్నామని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా కృష్ణా మోహన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని అల్లూరి సీతగారామరాజు క్రీడా మైదానంలో జులై 10 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ 9 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచి సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ జాతీయ మోడరన్ పెంటాతలన్ లో భాగం అయిన లేజర్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ జాతీయ పోటీలు మహారాష్ట్ర లోని నాశిక్ లో అక్టోబర్ 4వ తేదీ నుండి 6వ జరుగుతాయని అన్నారు.